క్లుప్తంగా

ఘనంగా అప్పన్న నిత్యకల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

విజేతలకు అభినందన



విజేతలతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: శ్రీకాకుళంలో రాష్ట్ర వుషు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించిన వుషు (చైనీస్ మార్షల్ ఆర్ట్స్) సబ్ జూనియర్, జూనియర్ పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు పతకాల పంట పండించారు. సబ్ జూనియర్ విభాగంలో యువరాజ్‌సింగ్ 48 కిలోల విభాగంలో వెండి పతకం, నిత్య శ్రీ 52 కిలోల విభాగంలో కాంస్య పతకం, జూనియర్ విభాగంలో షాగూన్ పాత్రో-48 కిలోల విభాగంలో బంగారు పతకం, హిమనిషి పార్మర్- 45 కిలోల విభాగంలో బంగారు పతకం, అర్పిత పాత్రో-52 కిలోల విభాగంలో వెండి పతకం, సాత్విక్ సిద్ధార్థ- 52 కిలోల విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి అభినందించారు.

పాత సామగ్రి వేలానికి టెండర్లు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని ఏరియా ఆస్పత్రిలో పాత సామగ్రిని వేలం వేయనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉష తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు కార్యాలయంలో బిడ్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. బిడ్ దరఖాస్తుకు రూ. 500 చెల్లించి దరఖాస్తును పొందాలని ఆమె కోరారు. దరఖాస్తుతో పాటు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ పేరుతో రూ.5వేల డిమాండ్ డ్రాఫ్టును సమర్పించాలి.25వ తేదీన బిడ్లు తెరిచి తక్కువ ధరకు కోట్ చేసిన టెండర్లను ఖరారు చేస్తామన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



గొటివాడలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా స్థానికంగా ఉండే ప్రతి సమస్యను గుర్తించి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని గొటివాడ గ్రామ సచివాలయం పరిధిలో ఆయన మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలోని గొటివాడ,గొటివాడ కాలనీ,సాలాపువానిపాలెం, బొండవానిపాలెం గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. కాలనీల్లో సీసీ డ్రైన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, సర్పంచ్ సాలాపు మీణ, బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, సురేష్‌రాజ్,పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీడీవో రమేష్ నాయుడు, విరోతి అప్పలనాయుడు,ఉప సర్పంచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే అదీప్‌రాజ్



లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. వాడచీపురుపల్లి గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవసరమైన ధ్రువపత్రాల కోసం వివరాలు సేకరిస్తున్నారన్నారు. 11 రకాల ధ్రువ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు.

టీడీపీ హయాంలో పచ్చ చొక్కాల వారికే సంక్షేమ పథకాలు అందేవని అదీప్‌రాజ్ విమర్శించారు. అందులోనూ టీడీపీ నేతలు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆదరించాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రజలను కోరారు. కార్యక్రమంలో భాగంగా వాడచీపురుపల్లి గ్రామ సచివాలయం-1 నుంచి 261, గ్రామ సచివాలయం -2 నుంచి 256 ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే అర్హులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, జగనన్న సురక్ష నియోజకవర్గ కోఆర్డినేటర్ కొటాన రాము, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, తహసీల్దారు పి.కనకారావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, వాడచీపురుపల్లి ఎంపీటీసీ గెద్దం పుష్పాచంద్రారావు, నాయకులు బొద్దపు చిన్నారావు, పైల అప్పలనాయుడు, బండి ముత్యాలు, దలాయి రాము, కూండ్రపు సోమునాయుడు, మండల పంచాయతీ విస్తరణాధికారి పద్మజ, వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వేంజేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అవసరం



విద్యార్థులతో సీఐ అశోక్‌కుమార్, పాఠశాల యాజమాన్యం

సింహాచలం: సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం నూతన విద్యామండలి ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. పెందుర్తి ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ కొత్తగా ఎన్నికైన మండలిలోని విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేశారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు తెలిసిన వ్యక్తిగా, దారి తెలిసిన వ్యక్తిగా ఉండాలన్నారు.

నేడు సబ్బవరంలో 'జగనన్న సురక్ష'

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలోని సబ్బవరం-1,సబ్బవరం-2 సచివాలయాల్లో బుధవారం నిర్వహించనున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే గ్రామ సభలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఆయా సచివాలయాల పరిధిలోని గ్రామస్తులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగనన్న సురక్షతో సత్వర న్యాయం



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన

సింహాచలం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా యూజర్ చార్జీలు లేకుండా 11 రకాల సర్టిఫికెట్లు అందిస్తున్నామని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. జీవీఎంసీ 95వ వార్డు చినముషిడివాడలోని ఇందిరా ప్రియదర్శిని కల్యాణమండంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హత ఉండి ఏఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ సందర్భంగా పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ 8వజోన్ ఏపీడీ శ్రీరామ్, సీవో కనకరత్నం, జేసీఎస్ ఇన్‌చార్జి మనలత జోబ్‌దాస్, నాయకులు నూకరాజు, పద్మ, ప్రసన్న, లక్ష్మి, చిన్నం నాయుడు, సంగమేశ్వరరావు, సంతోష్, దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి

- డీఎస్పీ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: యాసిడ్ వ్యాపారులు రికార్డులు పక్కాగా నిర్వహించాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సూచించారు. యాసిడ్ దాడుల నివారణ అన్న అంశంపై యాసిడ్, కెమికల్, బంగారం, మెడికల్ దుకాణాల వ్యాపారులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. నేరస్తులకు యాసిడ్ దొరికే పరిస్థితులను కఠినతరం చేయడం ద్వారా యాసిడ్ దాడులను అరికట్టవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. యాసిడ్ వినియోగం, వ్యాపారంలో కచ్చితమైన రికార్డులు పాటించాలని సత్యనారాయణ సూచించారు. కార్యక్రమంలో సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ సిరపరపు సురేష్, వ్యాపారులు, ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న సురేష్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ అన్నారు.మండలంలోని ఆరిపాక ధర్మకోనేరు చుట్టూ సర్పంచ్ పాలిశెట్టి పార్వతి ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపు నిచ్చారు. కోనేరు ఆధునికీకరణలో భాగంగా గట్టుపై సుమారు 50 మొక్కలు నాటినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎస్‌పీ రాజు, మహలక్ష్మినాయుడు, బండారు వెంకట రమణ,శరగడం శ్రీను, మజ్జి రాము,బుద్ద చంద్రశేఖర్,వెన్నల అప్పలనాయుడు,అదపురెడ్డి పైడంనాయుడు,కొల్లి శ్రీను పాల్గొన్నారు.

'ఉక్కు' సంకల్పానికి కేంద్రం తలవంచాల్సిందే..

కూర్మన్నపాలెం: ప్రజలు, కార్మికుల 'ఉక్కు' సంకల్పానికి కేంద్రప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఎన్ని ఎత్తుగడలు వేసినా పోరాటాల పురిటి గడ్డ అయిన విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగి రావాల్సిందేనన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరంలో 887వ రోజు, మంగళవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ, వాటిని అమలు జరిపే అధికారులకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తహతహలాడుతోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కొనడానికి ఎవరు ముందుకు వచ్చినా అడ్డుకుంటామన్నారు. పోరాటాలు, ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకున్న సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.